గిరిజన గ్రామాలకు మహర్దశ

కూటమి ప్రభుత్వం గిరిజన గ్రామాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ప్రధానంగా గిరిపుత్రులకు డోలీ మోతలు తప్పించాలనే లక్ష్యంతో పనిచేస్తోంది. ఈ మేరకు ఉపాధి హామీ నిధులతో పలు గిరిశిఖర గ్రామాలకు రోడ్లు మంజూరు చేసింది. ఇప్పటికే సాలూరు మండలంలో సిరివర తదితర గిరిజన గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలకు రూ.9 కోట్లు కేటాయించారు. ఆ పనులకు సంబంధించి ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తదితరులు శిలాఫలకం ఆవిష్కరించారు. అదేవిధంగా సుమారు రూ.రెండు కోట్లతో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో కాలువలు, రహదారులు, భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు.



అభివృద్ధే లక్ష్యంగా!



దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్‌ను అందిస్తున్న మంత్రి సంధ్యారాణి (ఫైల్)

పార్వతీపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రాధాన్య క్రమంలో అమలుచేస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తోంది. సంక్షేమ పథకాల అమలులో దూసుకుపోతోంది. ఆరు నెలల పాలనలో జిల్లాకు కొత్త వెలుగులను తీసుకొచ్చింది. ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి కేంద్రీకరించి శివారు భూములకూ నీరందేలా చర్యలు తీసుకుంటోంది. గిరిశిఖర గ్రామాల్లో కంటైనర్ ఆసుపత్రిని ప్రారంభించి గిరిజనులకు స్థానికంగానే వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. రహదారుల నిర్మాణాలను సైతం శరవేగంగా చేపడుతోంది. పల్లెల ప్రగతికి చర్యలు తీసుకుంటోంది. తాగునీరు, రోడ్లు, కాలువలు తదితర వసతుల కల్పనకు పెద్దపీట వేస్తోంది. పెంచిన పింఛను సొమ్మును ప్రతినెలా ఒకటో తేదీకే లబ్ధిదారులకు అందిస్తుండగా.. సామాన్య , మధ్యతరగతి వర్గాలకు దీపం-2 పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తోంది. గిరిజన ప్రాంతాల్లో గర్భిణుల కోసం కొత్తగా వసతి గృహాలు ఏర్పాటు చేసింది. టూరిజం అభివృద్ధికి కూడా చర్యలు తీసుకుంటోంది. మొత్తంగా గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైన జిల్లాను కూటమి సర్కారు గాడిలో పెడుతోంది.

సీతంపేటలోగర్భిణుల వసతిగృహం ఏర్పాటు...

జిల్లాలో మాతా శిశుమరణాల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. దీనిలో భాగంగా గిరిజన గర్భిణుల కోసం సీతంపేటలో నూతనంగా వసతిగృహాన్ని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు గర్భిణుల్లో రక్తహీనత నివారణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. సకాలంలో గిరిజన గర్భిణులకు పౌష్టికాహారం, వైద్యసేవలు అందేలా చూసుకుంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే గుమ్మలక్ష్మీపురం, సాలూరులో వసతిగృహాలను ఏర్పాటు చేశారు. తాజాగా సీతంపేటలోనూ ఏర్పాటు చేయడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

పర్యాటక అభివృద్ధి...

జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ప్రధానంగా సీతంపేట మండలంలో ఆడలి వ్యూ పాయింట్, మెట్టుగూడ జలపాతం, గిరిజన మ్యూజియం తదితర వాటికి పెద్దఎత్తున నిధులు మంజూరు చేసింది. దీంతో సందర్శకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండగా.. ఐటీడీఏకు ఆదాయం బాగానే వస్తోంది. మరోవైపు ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఎంతోమంది గిరిజన యువతకు ఉపాధి కల్పిస్తున్నారు.

కొత్త బస్సులు..

గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో జిల్లాలో కొత్తగా ఒక్క ఆర్టీసీ బస్సును కూడా ప్రారంభించలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకేసారి జిల్లాలో తొమ్మిది ఆర్టీసీ బస్సులను నూతనంగా ప్రారంభించారు.

ఉచిత గ్యాస్ సిలిండర్లు..

సూపర్ సిక్స్ హామీలులో భాగంగా ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల లోపే ప్రజలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందించిన ఘనత కూటమికే దక్కుతుంది. దీపం పథకం-2 కింద ఇప్పటివరకు జిల్లాలో 1,18,620 మంది లబ్ధిదారులకు

(మిగతా 8వ పేజీలో...)

- కూటమి ఆరు నెలల పాలనలో మన్యానికి కొత్త వెలుగులు
- వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన జిల్లా గాడిలో..
- సమస్యలు పరిష్కరిస్తూ .. హామీలు నెరవేరుస్తూ పాలన
- గిరిజన, మైదాన ప్రాంతాల్లో మౌలిక వసతులకు పెద్దపీట
- ప్రాధాన్య క్రమంలో పనులు.. బాగుపడుతున్న రహదారులు
- మెరుగుపడుతున్న మౌలిక వసతులు.. జిల్లావాసుల్లో హర్షం

పింఛన్‌దారుల్లో ఆనందం..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ సొమ్మును పెంచడంతో పాటు గత నెలల బకాయిలను కలిపి అందించింది. వైసీపీ ప్రభుత్వం ఏటా రూ.250 పెంచుతూ ఐదేళ్ల కాలానికి రూ.3వేలు చొప్పున సామాజిక పింఛన్లు అందించింది. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.వెయ్యి పెంచి ఎన్టీఆర్ భరోసా కింద లబ్ధిదారులకు ప్రతినెలా రూ.4వేల చొప్పున పింఛన్ సొమ్ము అందిస్తోంది. పెంచిన పింఛన్ ప్రకారం దివ్యాంగులకు రూ.6 వేలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రతినెలా రూ.పది వేలు, పూర్తిగా మంచం పట్టిన వారికి రూ.15 వేల చొప్పున అందిస్తున్నారు. దీంతో పింఛన్ దారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 1,41,307 మందికి వివిధ రకాల పింఛన్లు ఇస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.58.95 కోట్లు చెల్లిస్తోంది.



లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ (ఫైల్)

పింఛన్‌తో భరోసా



కూటమి ప్రభుత్వం వృద్ధాప్య పింఛను రూ.4వేలు అందించి భరోసా కల్పించింది. ఆ సొమ్మును నా వ్యక్తిగత అవసరాలు, వైద్య ఖర్చులతో పాటు మనుమల చదువులకూ వినియోగిస్తున్నా.

- కె.రామినాయుడు, పాలకొండ

బాగా చూసుకుంటున్నారు

కూటమి ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ సొమ్ములో నా అవసరాలకు పోను కొంత నగదు మిగులుతుంది. ఆ మొత్తం కుటుంబానికి ఇస్తున్నా. పింఛన్ సొమ్ము పెంచడం వల్ల కుటుంబ సభ్యులు బాగా చూసుకుంటున్నారు.

- గొట్టిపల్లి అప్పలమ్మ, మక్కువ

ఖర్చులు తగ్గాయి..

కూటమి ప్రభుత్వం దీపం-2 పథకం కింద అందించిన ఉచిత గ్యాస్ సిలిండర్‌ను అందుకున్నాం. చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వ చర్యలతో మా ఖర్చులు తగ్గాయి.

- ఎస్.శ్రీదేవి, పార్వతీపురం



పాచిపెంటలో మిల్క్ స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఏపీ డెయిరీ రీజనల్ సేల్స్ మేనేజర్

సక్రమంగా పాలు సరఫరా చేయాలి

- ఏపీ డెయిరీ రీజనల్ సేల్స్ మేనేజర్ రామకోటేశ్వరరావు

పాచిపెంట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సక్రమంగా పాలు సరఫరా చేయకపోతే కఠిన చర్యలు తప్పవని ఏపీ డెయిరీ రీజనల్ సేల్స్ మేనేజరు పి.రామకోటేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం పాచిపెంటలో మిల్క్ స్టాక్ పాయింట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతినెలా 2.82 లక్షల లీటర్ల పాలు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఏపీ డెయిరీ ఎండీ ఎంఎం నాయక్ ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రామభద్రపురం, బలిజిపేట మండలాల్లో మిల్క్ స్టాక్ పాయింట్లును పరిశీలించామన్నారు. పౌష్టికాహారంలో భాగంగా చిన్నారులకు క్రమం తప్పకుండా పాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వజ్ర ప్రైవేట్ సంస్థ ద్వారా పాలు సరఫరా జరుగుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 257 ఐసీడీఎస్ ప్రాజెక్టులుండగా 55,607 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 90 లక్షల లీటర్ల మిల్క్ సరఫరా చేస్తున్నామని వెల్లడించారు.

రక్తహీనత నివారణకు చర్యలు

- సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పాలకొండ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలో రక్తహీనత (అనీమియా) కేసులు ఎక్కువగా ఉన్నాయని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఈ కారణంగానూ మాతాశిశువులకు ఎటువంటి ప్రమాదం జరగకూడదన్నారు. శుక్రవారం పాలకొండ మండలం కొండాపుర గ్రామంలో పర్యటించారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణుల ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం గర్భిణుల రికార్డులను పరిశీలించిన ఆయన స్థానిక వైద్య సిబ్బందితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి గర్భిణీ సుఖ ప్రసవం కావాలంటే రక్తహీనత లేకుండా చూడాలని సూచించారు. అంగన్‌వాడీల ద్వారా సక్రమంగా పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ముఖ్యంగా ఆహారంలో ఆకుకూరలు, గుడ్లు, పాలు ఉండేలా చూసుకోవాలని గర్భిణులకు సూచించారు. ఈ పర్యటనలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ఎస్.మన్మథరావు అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి, ఏఎన్‌ఎంలు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

అధికారుల సహకారంతో సాధ్యం ..

పార్వతీపురం రూరల్: జిల్లా అధికారుల సహకారంతో రక్తహీనత నివారణ సాధ్యమని పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. శు క్రవారం పార్వతీపురం మండలం కృష్ణపల్లిలో ఎనీమియా యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతినెలా హిమోగ్లోబిన్ శాతం వృద్ధి చెందేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు గృహ సందర్శనలు చేసి గర్భిణులు, బాలింతలకు ఐరెన్స్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందించాలని సూచించారు. సమావేశంలో వైద్యఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన్‌రావు, సీడీపీవో బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గర్భిణుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్



జిల్లాకేంద్రంలో ర్యాలీ చేస్తున్న వైసీపీ శ్రేణులు

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

- వైసీపీ శ్రేణుల నిరసన

బెలగాం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు తగ్గించాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ విగ్రహం నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ఈకి వినతిపత్రం ఇచ్చారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని.. అవసరమైతే తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇప్పుడు చేసిందేమిటని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రశ్నించారు. విద్యుత్ చార్జీలు తగ్గించి.. ప్రజలపై భారం తగ్గించాలని, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిరసనలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల తరలింపునకు చర్యలు

- బాధితులకు అండగా ఉంటాం
- ప్రభుత్వ విప్ జగదీశ్వరి

8లో

ముందు నిలిచి.. అందరినీ నడిపించి!

- వైద్యాధికారుల చొరవ
- శ్రమదానంతో సమావేశ భవన నిర్మాణం
- సుందరంగా ఆస్పత్రి ప్రాంగణం
- నీలకంఠాపురం పీహెచ్‌సీకి కొత్త రూపు



6లో

1నుంచి పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ల స్వీకరణ

విజయనగరం, కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్లను జనవరి 1వ తేదీ నుంచి సబ్‌ట్రెజరీ కార్యాలయంలో స్వీకరిస్తామని జిల్లా ఖజానా అధికారి ఆర్ఎస్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో బయోమెట్రిక్ విధానం ద్వారా సమర్పించవచ్చని చెప్పారు జీవన్ ప్రమాన్ యాప్ ద్వారా ధ్రువపత్రాలు సమర్పించవచ్చని అన్నారు. పెన్షనర్లకు సహాయ, సహకారాలు అందించేందుకు విజయనగరం జిల్లా ట్రెజరీ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

సంప్రదాయబద్ధంగా కందికొత్తల పండుగ

- వారం రోజుల పాటు

గిరిజన గ్రామాల్లో సందడే సందడి

6లో

బహిరంగ మలవిసర్జన రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- అధికారులకు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశం

మక్కువ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మలవిసర్జన రహిత జిల్లాగా మన్యాన్ని తీర్చిదిద్దాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ప్రతిఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించుకోవాలన్నారు. అవసరమైతే మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. శుక్రవారం అనసభద్ర గ్రామంలో ఆయన పర్యటించారు. పల్లె పండగకార్యక్రమంలో భాగంగా నిర్మించిన కాలువలు, మరుగుదొడ్లు, జలజీవన్‌మిషన్ పథకాల అమలు తీరును పరిశీలించారు. మురుగు నీటి కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని, మరుగుదొడ్లు సక్రమంగా వినియోగించడం లేదని గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ప్రతి ఇంటికీ మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ కొందరు బహిరంగ మలవిసర్జన చేస్తున్నారని, వారిలో ముందుగా మార్పు రావాలని కలెక్టర్ అన్నారు. జిల్లాలో మరుగుదొడ్లు లేని ఇళ్లు ఉండరాదన్నారు. స్థలాభావం ఉన్న ఇళ్లకు సంబంధించి ప్రభుత్వ స్థలంలో సామాజిక మరుగుదొడ్లు నిర్మించి, నిర్వహణను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటించి విద్యా ప్రమాణాలను గమనించారు. ఈ సందర్భంగా ఒకటి రెండు తరగతుల విద్యార్థులు రాసిన వర్క్స్ పరిశీలించారు. పనసభద్ర గ్రామంలో గర్భిణుల రక్తహీనత నివారణపై నిర్వహించిన అవగాహన కార్య క్రమంలో పాల్గొన్నారు. ఈ పర్యటనలో జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి నగేష్‌బాబు, ఎంపీడీవో స్వరూపరాణి, తహసీల్దార్ షేక్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.



పల్లె పండుగ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



శ్రమదానంతో రూపొందించిన గది ముందర ఇలా..

అదో మారుమూల పల్లెటూరు. అక్కడో ఆస్పత్రి. అన్ని రకాల చికిత్సలూ ఆ చిన్న భవనంలోనే. సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేయాలంటే చెట్ల నీడను ఆశ్రయించాలి... మరి ఈ సమస్యలకు పరిష్కారం ఎక్కడ ఉంది?..ఇదే ఆలోచన ఆ ఇద్దరు యువ వైద్యాధికారులను కొత్త దారి వెదికేలా చేసింది. సిబ్బందితో పాటు ప్రజలను కదిలించింది. ఫలితంగా శ్రమదానంతో ఓ చిన్నపాటి సమావేశ గది అందుబాటులోకి వచ్చింది. ఆస్పత్రి ప్రాంగణం అందంగా మారింది. ఇదీ నీలకంఠాపురం పీహెచ్‌సీ ప్రత్యేకత.



కొత్తగా నిర్మించిన గదిలో సమావేశమైన సిబ్బంది

ముందు నిలిచి.. అందరినీ నడిపించి!

- వైద్యాధికారుల చొరవ
- శ్రమదానంతో సమావేశ భవన నిర్మాణం
- సుందరంగా ఆస్పత్రి ప్రాంగణం
- నీలకంఠాపురం పీహెచ్‌సీకి కొత్త రూపు

కురుపాం రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి):

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండల శివారులోని నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఓ మూలన విసిరేసినట్టు ఉంటుంది. ఒకప్పుడు మొబైల్ మెడికల్ యూనిట్‌గా ఉండేది. ప్రజల విజ్ఞప్తులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ చేశారు. పక్కా భవనం, ప్రహరీలను నిర్మించారు. ఆసుపత్రి ప్రాంగణం పిచ్చి మొక్కలతో అధ్వానంగా ఉండేది. 2022 మార్చిలో డాక్టర్ అభినవ్ కుమార్ మొదటి మెడికల్ ఆఫీసరుగా అక్కడ బాధ్యతలు స్వీకరించారు. మరో వైద్యునిగా తన స్నేహితుడు డాక్టర్ అమర సింహారెడ్డిని అక్కడ బాధ్యతలు చేపట్టేలా చేశారు. ఈ పీహెచ్‌సీ పరిధిలోని నీలకంఠాపురం, టొంపలపాడు, జరడ, ఒబ్బంగి, ఊసకొండ సచివాలయాల పరిధిలోని 14,500 మంది గిరిజనులకు వైద్య సేవలు అందించాల్సి ఉంది. ఇద్దరు వైద్యులు బాధ్యతలను సర్దుకొని... తమ శక్తి మేరకు వైద్య సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందారు. ఆసుపత్రి భవనంలో సమావేశాలు నిర్వహించేందుకు స్థలం ఉండేది కాదు. దీంతో ఆ ప్రాంగణంలోని చెట్టు కింద సమావేశాలు నిర్వహించే వారు. క్షేత్ర స్థాయి సిబ్బంది నేలపైనే కూర్చోవలసి వచ్చేది. దీనివల్ల వారంతా ఇబ్బంది పడే వారు. ఇది చూసిన వైద్యాధికారులు బాధ పడేవారు. సమావేశాల కోసం కనీసం ఓ షెల్టర్ నిర్మిస్తే బాగుంటుందని భావించారు. శ్రమదానం ద్వారా చేస్తే ఎలా ఉంటుందని ఆలోచించారు. అనుకున్నదే తడవుగా సిబ్బందితో చర్చించారు. శ్రమదానానికి సిబ్బంది ముందుకు వచ్చారు. అందరి సహకారంతో విశాలమైన స్థలంలో రేకుల షెడ్డు నిర్మించారు. దానికి వెదురుబద్దలతో గోడలు కట్టారు. నేలపై గచ్చు వేశారు. సమావేశాల నిర్వహణకు వీలుగా అందులో చిన్నపాటి వేదిక నిర్మించారు. రూ.4 లక్షల విలువ గల పనులను అవలీలగా చేశారు. ఆ హాల్‌లోకి వెళ్లేందుకు అందమైన రహదారి.. దానికి రెండు వైపులా మొక్కలు నాటారు.



ఇదే నీలకంఠాపురం పీహెచ్‌సీ



శ్రమదాన సారథులు డా.అభినవ్ కుమార్, డా.అమరసింహారెడ్డి

అందరి భాగస్వామ్యంతో..

ఆసుపత్రి ప్రాంగణంలో ఉండే భారీ చెట్టు చుట్టూ విశాలమైన రచ్చబండ నిర్మించారు. ఈ పనుల కోసం ఇద్దరు వైద్యాధికారులు రూ.60 వేలు వెచ్చించారు. ఆసుపత్రి సిబ్బంది గౌడు శ్రీహరిరావు, జగన్నాథం, మురళి తదితరులు తలో చేయి వేశారు. రాళ్లను గిరిజనులే స్వయంగా సమకూర్చారు. ట్రాక్టర్ యజమానులు ఉచితంగా మెటీరియల్‌ను సరఫరా చేశారు. రేకుల షెడ్డు నిర్మించిన వెల్డర్, మేస్త్రీలు సైతం తక్కువ డబ్బులకే పనులు చేసి పెట్టారు. మాజీ మండలాధ్యక్షుడు హిమరిక నీలకంఠేశ్వరరావు, సర్పంచ్ అడ్డాకుల మన్మథరావు కొంతమేర సిమెంట్‌ను విరాళంగా అందించారు. పోలీసు శాఖ వారు ఇసుకను సమకూర్చారు. ఇలా వివిధ శాఖలు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఓ అందమైన ప్రాంగణం నీలకంఠాపురం ఆసుపత్రిలో రూపుదిద్దుకుంది. సుందరమైన సమావేశ గది అందుబాటులోకి వచ్చింది. ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేటప్పుడు గర్భిణుల బంధువులు వంటావార్పునకు, వేచి ఉండడానికి దీనినే వినియోగిస్తున్నారు. ఆసుపత్రి వెనుక భాగంలోని ఖాళీ స్థలంలో వివిధ రకాల కూరగాయలు, అరటిని వేశారు. ఆనప, బీర, చిక్కుడు, గుమ్మడి వంటి పాదులు వేశారు. పండిన కూరగాయలను రోగులకు పంచి పెడుతున్నారు.


ఎంతో ఆనందంగా ఉంది..

ఆసుపత్రి ప్రాంగణాన్ని శ్రమదానంతో చక్కదిద్దడం ఆనందంగా ఉంది. మొదటిసారి బాధ్యతలు చేపట్టిన ప్రదేశాన్ని బాగుచేయడం మా ఇద్దరి డాక్టర్లకు జీవితంతో మరిచిపోలేని అనుభూతిగా మిగిలిపోతుంది. శ్రమదానం గురించి చెప్పగానే చాలా మంది తమకు తోచిన సాయం చేశారు. లక్షలాది రూపాయల విలువ గల పనులు ప్రజల సహకారంలో పెద్దగా ఖర్చుతో పని లేకుండా చేయగలిగాం.

-డాక్టర్ అభినవ్ కుమార్, మెడికల్ ఆఫీసర్ నీలకంఠాపురం

నగర పాలక సంస్థ ఆదాయం
పెంచడమే లక్ష్యం

- మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి
- పాలిథిన్ నిషేధంపై ముందుకే
- ట్రేడ్ లైసెన్సుల ఫీజు తగ్గింపు
- ఆనంద గజపతి కళాక్షేత్రానికి రాయితీ
- నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'విజయనగరం నగర పాలక సంస్థ ఆదాయం పెంపే లక్ష్యంగా పని చేస్తున్నాం. బాధ్యతలు చేపట్టి నాలుగు నెలలే అయ్యింది. ఎవరినీ ఇబ్బందులకు గురిచేయకుండా... నిబంధనలు అనుసరించి నిర్మాణాలు చేపట్టాలని... ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలని ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. షాపింగ్ కాంప్లెక్స్ నుంచి వచ్చిన ఆదాయం వివిధ అభివృద్ధి పనులకు వెచ్చిస్తుతన్నాం. మొండి బకాయిలపై వారికి ఇబ్బంది లేకుండా వసూలు చేస్తున్నాం.' అని నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. వివిధ అంశాలపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో శుక్రవారం మాట్లాడారు.

ప్రశ్న: నగర పాలక సంస్థ ఆదాయాన్ని ఎలా పెంచబోతున్నారు?

జవాబు: నగరంలో ఉన్న ప్రతి ఇంటికి నిబంధనల ప్రకారం పన్నులు వేయాలని నిర్ణయించాం. విజయ నగరంలో నాలుగు నెలల కాలంలో 2,325 అసెస్‌మెంట్లు గుర్తించి, వాటికి పన్నులు వేశాం. వాటి ద్వారా దాదాపు రూ.2 కోట్ల ఆదాయం సమకూరనుంది. తాజాగా రైల్వే ఆస్తులకు సంబంధించి సర్వీసు పన్ను విధించాం. తక్షణమే రూ.30 లక్షల ఆదాయం వస్తోంది. ఇకపై ఏటా రూ.10 లక్షల వంతున రైల్వే శాఖ నగరపాలక సంస్థకు చెల్లించనుంది.

ప్ర: మొండి బకాయిల మాటేంటి?

జ: నగరంలోని వివిధ అసెస్‌మెంట్లకు పన్నులు వేశాం. వసూళ్ల వేగవంతం చేశాం. ఇక నగరపాలక సంస్థకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో 328 షాపులు ఉన్నాయి. వీటిలో కొన్ని మొండి బకాయిలు ఉన్నాయి. వీటిపై ప్రత్యేక దృష్టి సారించాం. వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా గత నాలుగు నెలల కాలంలో రూ.1.09 కోట్లు వసూలు చేశాం.

ప్ర: పాలిథిన్ నిషేధం ఎంత వరకు వచ్చింది?

జ: ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించేందుకు దాడులు చేస్తున్నాం. అధికారులు దీనిపై ఒక వైపు అవగాహన కల్పిస్తూనే మరోవైపు అపరాధ రుసుం వసూలు చేస్తారు. కొద్ది రోజుల కిందటే నిబంధనలకు అనుగుణంగా లేని పాలిథిన్ సంచులు, గ్లాసులను పెద్ద ఎత్తున సీజ్ చేశాం. నిషేధిత వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉంటాం. ఇది నిరంతర ప్రక్రియ.

ప్ర: పారిశుధ్య పరిస్థితి ఏమిటి?

జ: నగర జనాభా పెరుగుతోంది. నగరంలో ప్రతి రోజు 114 టన్నుల చెత్త వస్తోంది. ఈ చెత్తను సంపదగా సృష్టించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఇందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాం. ఇంటింటికి చెత్త సేకరణ కార్యక్రమం నడుస్తోంది పారిశుధ్య సిబ్బంది బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తున్నారు. నేను నగరంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తున్నాను. ఎక్కడ సమస్య ఉన్నా.. వెంటనే శానిటరీ విభాగం అధికారులను అప్రమత్తం చేస్తున్నాం. పారిశుధ్య సమస్య లేని నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం. నగర ప్రజలు, శానిటరీ విభాగం అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో నగర పాలక సంస్థకు సహకరించాలి.

ప్ర: ట్రేడ్ లైసెన్సుల పరిస్థితి ఏంటి?

జ: విజయనగరంలో ఎంతో మంది వ్యాపారాలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం వ్యాపారం చేసే వారు ట్రేడ్ లైసెన్సు కలిగి ఉండాలి. చాలా మందికి లేవు. ట్రేడ్ లైసెన్సు ఫీజు తగ్గించాలని ఛాంబర్ ఆఫ్ కామర్స్ వంటి సంస్థలు నగర పాలక సంస్థ దృష్టికి తీసుకువచ్చాయి. ఈ ప్రతిపాదనను కౌన్సిల్ ముందు ఉంచాం. కౌన్సిల్ అందుకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంది. ట్రేడ్ లైసెన్సు ఫీజు తగ్గే విధంగా చర్యలు చేపట్టాం. విజయనగరంలో 1,223 ట్రేడ్ లైసెన్సులు ఉండగా... గత నాలుగు నెలల కాలంలో మరో 130 మంది వ్యాపారులు ట్రేడ్ లైసెన్సులు తీసుకున్నారు. దీని ద్వారా నగర పాలక సంస్థకు రూ .33 లక్షల ఆదాయం పెరిగినట్టయ్యింది.

ప్ర: ఆనందగజపతి కళా క్షేత్రానికి రాయితీ ఎందుకు?

జ: విజయనగరం కళలకు రాజధాని. కళలు, క్రీడలు, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల నిర్వహణకు ఆనంద గజపతి కళాక్షేత్రాన్ని ఎంపిక చేసుకుంటే వారికి 50 శాతం రాయితీ ఇచ్చేందుకు నిర్ణయించాం. కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం అద్దె రూ.30 వేలు ఉంది. కళా, క్రీడా, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల నిర్వహణకు కేవలం రూ.15 వేలు తీసుకుంటాం.

ప్ర: ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు... మరోవైపు సాహిత్య సేవ చేస్తున్నారు. ఎలా?

జ: ఉద్యోగ బాధ్యలతో పాటు ఇష్టమైన సాహిత్య సేవపై దృష్టి కేంద్రీకరించాను. ఇటీవలే 'తరం వెళ్లిపోతుంది' అని ఒక ప్రత్యేక సాహిత్య కార్యక్రమాన్ని రూపొందించాం. అన్ని సామాజిక మాధ్యమాల్లో పెట్టాం. పూర్వం గ్రామాలు, నగరాల్లో ఉన్న ఆచారాలు సంప్రదాయాలు, కట్టుబాట్లు, ఉత్తరాంధ్ర భాష, యాసల గొప్పతనాన్ని ఈ వీడియో చాటి చెప్పింది. ఇది ఎంతో సంతృప్తినిచ్చింది.

ప్ర: నగర పాలక సంస్థకు లోగో ఎందుకు?

జ: ఏ సంస్థకైనా ఒక లోగో ఉంటేనే గుర్తింపు. ఈ నేపథ్యంలోనే విజయనగరం సంస్కృతి, సంప్రదాయం, చరిత్రను దృష్టిలో ఉంచుకుని ఒక లోగోను రూపొందించాం. జరిగింది. దీనిని జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఆమోదించారు. కౌన్సిల్ కూడా ఆమోదించింది. ఈ లోగో ప్రత్యేక ఆకర్షణ కానుంది. దీనిపై అన్ని వర్గాల నుంచి ప్రశంసల వర్షం కురుస్తోంది.

సంప్రదాయబద్ధంగా కందికొత్తల పండగ

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం, కురుపాం షెడ్యూల్డ్ గిరిజన ప్రాంతీయుల సంప్రదాయ కందికొత్తల పండగలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు వివిధ గ్రామాల్లో ఈ పండగలు నిర్వహిస్తారు. గ్రామంలోని గిరిజనులందరూ సమైక్యంగా ఈ పండగలో పాల్గొంటారు. పిల్లా పాపలతో గిరిజన గ్రామ దేవత జాకరమ్మ దగ్గరకు వెళతారు. అమ్మవారికి పూజలు చేసి... కొత్తగా పండిన వరి, కంది ఇతర పంటలను, కాయగూరలను వంట చేసి నైవేద్యంగా పెడతారు. ఆ తర్వాత కోడిపిల్ల, మేక తదితర జంతువులను బలి ఇస్తారు. అనంతరం అక్కడ ఒక గొడ్డలి పెట్టి... దానికి పసుపు పూస్తారు. కుంకుమ బొట్లు పెట్టి... పువ్వులతో అలంకరిస్తారు. ఆ గొడ్డలిని జాకరమ్మగా భావించి తమ ఊరితో పాటు సమీపంలోని గ్రామాల్లో ఊరేగిస్తారు. ఈ ఊరేగింపులో గిరిజన మహిళలు నూతన వస్త్రాలు ధరించి... థింసా నృత్యం చేస్తారు. గిరిజన యువకుల డప్పు వాయిద్యాలకు అనుగుణంగా... మహిళలు నృత్యం చేస్తారు. ఈ ఊరేగింపులో ప్రతి ఇంటికీ గొడ్డలమ్మను తీసుకొని వెళతారు. దీనిని ప్రతి ఒక్కరూ నీళ్లతో కడిగి... పూజ చేస్తారు. బియ్యం, కాయగూరలు, నగదు దానం చేస్తారు. ఇలా వారం రోజుల పాటు ఈ పండగ నిర్వహిస్తారు. చివరి రోజు గ్రామ ప్రజలందరూ కలిసి వారు సేకరించిన సరుకులతో వంట చేసి సమైక్యంగా భోజనం చేస్తారు. ఈ పండగకు బంధువులతో పాటు స్నేహితులను కూడా ఆహ్వానిస్తారు. ఈ వేడుకను తిలకించడానికి పల్లపు ప్రాంతాల నుంచి కూడా ఆసక్తి గల ప్రజలు వస్తుంటారు. ఈ నెల 29 నుంచి గుమ్మలక్ష్మీపురంలో సమీప గిరిజన గ్రామాలకు చెందిన ప్రజలందరూ వచ్చి ఈ పండగను నిర్వహించడానికి సంబంధిత సంఘాలు ఏర్పాటు చేస్తున్నాయి. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, పీవో తదితర అధికారులను ఆహ్వానిస్తున్నారు.

- తాడికొండ గ్రామంలో నిర్వహించిన కంది కొత్తల పండగలో ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం పాల్గొన్నారు. ముందుగా కోరికలు తీర్చే కల్పవల్లి ఇరిడి గ్రామ సమీపంలో వెలిసిన కప్పరమ్మను కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. తాడికొండ గ్రామంలో కంది కొత్తల పండగ సందర్భంగా మహిళలతో కలిసి సంప్రదాయ నృత్యం చేశారు.



ఊరేగింపులో పాల్గొన్న గిరిజనులు



కందికొత్తల పండగలో పాల్గొన్న ఎమ్మెల్యే జగదీశ్వరి

పశువులశాలగా.. పాఠశాల భవనం



పాఠశాల భవనంలో పశువులను కట్టిన దృశ్యం

బొబ్బిలి రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈ చిత్రం చూసి పశువులకు ఇంత మంచి శాల ఎక్కడ ఉందా అనుకుంటున్నారా? ఇది పశువుల శాల కాదు. పాఠశాల కోసం నిర్మించిన భవనం. చెల్లారపువలసలో సుమారు ఏడేళ్ల క్రితం పాఠశాల అదనపు భవనానికి ప్రభుత్వం రూ.5 లక్షలు కేటాయించింది. నిర్మాణం మధ్యలో ఉండగా.. గ్రామంలో విద్యార్థులు తక్కువ ఉన్నారనే కారణంతో పాఠశాలను ఎత్తేశారు. రంగరాయపురం పాఠశాలలో దీనిని విలీనం చేశారు. అప్పటి నుంచి ఆ భవనం నిరుపయోగంగా ఉంది. ఇదే అదునుగా భావించి స్థానికులు పశువుల శాలగా మార్చేశారు. పశువులను కట్టడంతో పాటు పశుగ్రాసాన్ని నిల్వ చేస్తున్నారు. ఈ విషయమై ఎంఈవో సీహెచ్ లక్ష్మణరావును వివరణ కోరగా.. తాను పిల్లల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి... ఎంతమంది పాఠశాలకు వస్తారనే విషయమై ఆరా తీశానని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చానని చెప్పారు. పాఠశాల పునః ప్రారంభించే అవకాశాలు కనిపించడం లేదని... ప్రభుత్వం ఆ భవనాన్ని ఇంకేదైనా అవసరాలకు వినియోగించుకుంటే బాగుంటుందని అన్నారు.

పాఠాలు బోధించిన 'మన్యం' కలెక్టర్

పార్వతీపురం రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మండలం పెద్దబొండపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ పాఠాలు బోధించారు. తాను గతంలో ఉపాధ్యాయుడిగా పనిచేశానని గుర్తు చేసుకున్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యనభ్యసించానని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించిన వారెందరో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్

వెంకన్న పూలంగి సేవకు సన్నాహాలు

బొబ్బిలి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక కంచర వీధి కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా శనివారం పూలంగి సేవను నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయంలో సన్నాహాలు చేస్తున్నారు. భక్త సంఘం ఆధ్వర్యంలో వివిధ రకాల పూలను పెద్దఎత్తున తీసుకొచ్చి ఆలయాన్ని అలంకరిస్తున్నారు.



పూలంగి సేవ కోసం సిద్ధం చేసిన పూలు



గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్

ఈవీఎం గోదాం తనిఖీ

నెల్లిమర్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈవీఎం గోదాంలను కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ శుక్రవారం తనిఖీ చేశారు. జి-4, 6 గదులకు వేసిన సీళ్లను తెరిపించి వాటిని పరిశీలించారు. ఈవీఎం గోదాముల పక్కన ఉన్న కస్తూర్బా విద్యాలయం ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. తనిఖీల్లో డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీవో కీర్తి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ భాస్కరరావు, తహశీల్దార్ బి.సుదర్శనరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల ఎస్ఐకి ప్రశంసలు



ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ

నెల్లిమర్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేందుకు, అలాగే పరిష్కారమయ్యేందుకు కృషి చేసిన నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్‌ను ఎస్పీ వకుల్ జిందల్ ప్రశంసించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవా టరం ఎస్ఐ గణేష్‌కు ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.

జనసేనకు న్యాయం చేయండి

నెల్లిమర్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పోస్టుల్లో కూటమి పొత్తు ధర్మం ప్రకారం జనసేన నాయకులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఈమేరకు శుక్రవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జునను జనసేన నాయకులు చనమల్లు వెంకటరమణ, కరుమజ్జి గోవిందరావు, ఎడ్ల గోవిందరావు, ఎం.ఎం.నాయుడు, పతివాడ గోవిందరావు, అవనాపు మురళీకృష్ణ తదితరులు కలిశారు.

విమర్శలు సరికాదు

నెల్లిమర్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతుల్లో బోధనేతర సిబ్బందికి పది శాతం కోటా కేటాయిస్తూ ఇంటర్మీడియట్ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులపై నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విమర్శలు చేయడం, నిరసనలకు దిగడం సరికాదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్య బోధనేతర సిబ్బంది సమాఖ్య రాష్ట్రశాఖ తీవ్రంగా ఖండించింది. ఈమేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.వి.ఎస్.పి.జోగారావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 30 ఏళ్లలో ఎంతో మంది బోధనేతర సిబ్బంది లెక్చరర్లుగా పదోన్నతి పొందారని, ఎందరో విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దారన్నారు. రాజ్యాంగబద్ధంగా పొందుతున్న పదోన్నతులపై విమర్శలు చేయడం మానాలని ఆయన సూచించారు.

రామతీర్థం దేవస్థానానికి స్టీలు ప్లేట్లు, గ్లాసులు

నెల్లిమర్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని రామస్వామి దేవస్థానానికి అదే గ్రామానికి చెందిన ఖండవిల్లి కిషోర్‌కుమార్, ఖండవిల్లి కిరణ్‌కుమార్ 100 స్టీల్ ప్లేట్లు, 100 గ్లాసులను శుక్రవారం వితరణ చేశారు. ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదానం కార్యక్రమంలో వినియోగించేందుకు తమ తండ్రి ఖండవిల్లి రామకృష్ణాచార్యులు పేరిట వాటిని దేవస్థానం ఈవో వైశ్రీనివాసరావుకు అందజేశారు. కిరణ్‌కుమార్ రామస్వామివారి దేవస్థానంలో అర్చకుడిగా పనిచేస్తున్నారు. అలాగే విజయనగరానికి చెందిన విజయరామ జ్యూయలర్స్ అధినేత దాసరి శ్రీనివాస్ దంపతులు కూడా మరో 100 ప్లేట్లతో పాటు 100 గ్లాసులను ఈవోకు అందజేశారు.

వేళలు పాటించండి

గజపతినగరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల నిర్వాహకులు వేళలు తప్పనిసరిగా పాటించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి బి.శ్రీనాథుడు అన్నా రు. శుక్రవారం స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాల యాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా మద్యం దుకాణదారులతో సమావేశమయ్యారు. దుకాణల వద్ద ధరల పట్టిక తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్ర మంలో సీఐ జనార్దనరావు, ఎస్ఐలు నరేంద్ర కుమార్, కొండలరావు ఉన్నారు.

1 వరకూ సంతాప దినాలు

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతికి సంతాప సూచికంగా కేంద్ర ప్రభుత్వం డిసెంబరు 26 నుంచి జనవరి 1 వరకూ వారం రోజుల పాటు సంతాప దినాలుగా ప్రకటించిందని డీఆర్వో శ్రీనివాసమూర్తి ప్రకటనలో పేర్కొన్నారు. దీన్ని అందరూ గమనించాలని సూచించారు.

దేశానికి తీరని లోటు

విజయనగరం రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని ఎమ్మెల్యే అదితి పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం ఆమె ప్రకటన విడుదల చేశారు. సంస్కరణల ప్రధానమంత్రిగా పేరుగాంచారన్నారు.

అనుమతులతో మాకేంటి పని?

- ఎస్.కోటలో ఇష్టారాజ్యంగా ఆక్రమణలు
- అడ్డగోలుగా భవన నిర్మాణాలు
- నేడు పాలక మండలి సమావేశం





సెప్టెంబరు 5న తెరిచిన మురుగు కాలువ .. అదేచోట అడ్డంగా నిర్మించిన గోడ

శృంగవరపుకోట డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పంచాయతీ పరిధిలో ఇష్టారాజ్యంగా ఆక్రమణలు జరుగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపడుతున్నారు. అక్రమ నిర్మాణాలను అధికారులు తొలిగించినా.. మళ్లీ అదేచోట వెలస్తున్నాయి. ఈ విషయంలో పంచాయతీ పాలక మండలి ఉదాసీనంగా వ్యవహరిస్తుందనే విమర్శలు ఉన్నాయి. అక్రమార్కులు కూడా వెనక్కి తగ్గడంలేదు. ఈ విషయాలపై సమావేశాల్లో సభ్యులు లేవనెత్తినా అధికారులు తేలికగా తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం నిర్వహించే పంచాయతీ సాధారణ సమావేశంలో అనుమతులు లేకుండా జరుగుతున్న నిర్మాణాలు, చెరువులు, కాలువల అక్రమణలు, విశాఖ-అరకు రోడ్డు అక్రమణలపై సభ్యులు మళ్లీ ప్రస్తావిస్తారని పలువురు ఆశిస్తున్నారు. అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండమే ఇందుకు కారణమని పలువురు అంటున్నారు. విశాఖ-అరకు రోడ్డుకు ఇరువైపులా అక్రమణలు వెలిశాయి. కొంత మంది నాయకులే ఆక్రమించేశారు. షాపులు నిర్మించి చిరు వ్యాపారులకు అద్దెకు ఇచ్చారు. వీరి నుంచి పెద్దమొత్తంలో అద్దెలు పొందుతున్నారు. ఈ దుకాణాలన్నీ రోడ్డు పైకి వచ్చేయడంతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. పంచాయతీ పంచాయితీ పరిధిలోని చెరువులు, సాగునీటి కాలువలను పలువురు మింగేశారు. 1.79 ఎకరాల రాజు చెరువు గర్భం అక్రమణలకు గురైంది. దాదాపు 44 పక్కా భవనాలు ఉన్నాయి. ఇలా చెరువుల్లో అక్రమ నిర్మాణాలు ఉన్నాయి. పుణ్యగిరి గెడ్డ కూడా అక్రమణకు గురైంది. పంచాయతీ నుంచి అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు జరిగినా పంచాయితీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై పాలక మండలి సమావేశంలో చర్చిస్తే అందరికీ మేలు జరుగుతుంది.

వసతుల కల్పనకు చర్యలు

విజయనగరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సారిపల్లి టిడ్కో కాలనీలో మౌలిక వసతుల లేమిపై 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 24న 'నిలువెత్తు నిర్లక్ష్యం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కాలనీలో సీసీ రోడ్డు లేవని అంగీకరిస్తూ.. 30 శాతం పనులు పూర్తి చేశామని ప్రకటన విడుదల చేశారు. మిగిలిన రోడ్ల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటామని, డ్రైన్లు పూర్తయ్యాయని తెలిపారు. తాగునీటి కొర త లేకుండా బోరుబావులు ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన పనులను పూర్తి చేయాలని గుత్తేదారుడికి నోటీసులు జారీ చేశామని తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రహదారి మరమ్మతులకు నిధులు

వంగర, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాగెమ్మపేట రహదారికి ఎట్టకేలకు మరమ్మతులకు అధికారులు ముందుకొచ్చారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'గతుకుల రహదారి' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ స్పందించారు. బాగెమ్మపేట రహదారికి ఉపాధి నిధులు వెచ్చించి వెంటనే పనులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. దాంతో అధికారులు శుక్రవారం బాగెమ్మపేట రహదారిని పీఆర్ ఏఈ ఆనంద్ పరిశీలించారు. నీలయ్యవలస, బాగెమ్మపేట పంచాయతీల నుంచి తీర్మానాలు సేకరించారు.

డ్యామ్ నిర్మాణానికి మట్టి పరీక్షలు

వేపాడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగంగుబూడి సమీపంలో సుజల స్రవంతి ప్రాజెక్టు వీరనారాయణం డ్యామ్ నిర్మాణానికి యంత్రాలతో మట్టి పరీక్షలు చురుగ్గా చేపడుతున్నట్లు డీఈఈ సుప్రజ తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆమె మట్టి పరీక్షల తీరు పరిశీలించారు. అనతరం ఆమె మాట్లాడుతూ మూడు రోజులుగా పరీక్షలు చేపడుతున్నామని, నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.



మట్టి పరీక్షలను పరిశీలిస్తున్న డీఈఈ

పనులు అడ్డుకుంటాం..

ఇదిలా ఉండగా వీరనారాయణం డ్యామ్ నిర్మాణానికి సంబంధించి సుజల స్రవంతి అధికారులు రైతులతో మాట్లాడకుండా, పరిహారం చెల్లించకుండా మట్టి పరీక్షలు చేపడుతుండటం దారుణమని రైతు సంఘం జిల్లా నాయకుడు చల్లా జగన్ అన్నారు. మట్టి పరీక్షలను అడ్డుకుంటామన్నారు. భూములకు పరిహారం చెల్లించిన తర్వాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

గజపతినగరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో పంటలు కోల్పోయిన రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మాజీ మంత్రి, జనసేన పీఏసీ నాయకురాలు పడాల అరుణ అన్నారు. శుక్రవారం మండలంలోని డోలపాలెంలో ముంపునకు గురైన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయనుందన్నారు. ఆమెతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు ఎం.జగన్, కార్యనిర్వహక కార్యదర్శి దుర్గాప్రసాద్, లక్ష్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవికి పల్లకి సేవ

జామి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నంరాజుపేట పుష్పగిరి వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం గోదాదేవికి పల్లకి సేవ నిర్వహించారు. వేణుగోపాలస్వామికి ఆలయ ప్రధాన అర్చకుడు సీతారామచార్యులు ప్రత్యేక పూజలుచేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



గోదాదేవికి పల్లకిలో ఊరేగింపు

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

మెంటాడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆండ్ర ఎస్ఐ సీతారాం సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా శుక్రవారం ఆయన గిరిజన గ్రామాలైన రేగులపాడు, పెదపా డులో పర్యటించారు. సారా తయారీ, విక్రయం, వినియోగం చట్టరీత్యా నేరమ న్నారు. బాల్యవివాహాలతో కలిగే నష్టాలను వివరించి, వాటికి దూరంగా ఉండాలని కోరారు. బడిఈడు పిల్లలను పాఠశాల లకు పంపాలని, ప్రభుత్వ పథకాలు, ఇతర సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా 40 కుటుంబాలకు దుప్పట్లు, బియ్యం, పెదమేడపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు వాలీబాల్ కిట్లు అందజేశారు.



దుప్పట్లు, నిత్యావసరాలు అందజేస్తున్న ఎస్ఐ

నిరవధిక దీక్ష ప్రారంభం

చీపురుపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్లాం వెంకటరామ పౌల్ట్రీస్ వద్ద శుక్రవారం కార్మికులు నిరవధిక దీక్షను ప్రారంభించారు. వేతన ఒప్పందంపై యాజమాన్యం తన మొండి వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు అంబల్ల గౌరినాయుడు, సంఘం ప్రతినిధి గురునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. హాస్టల్‌కు వెళ్లేదెలా?

గజపతినగరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): లోగిసలోని ఇంటిగ్రేటెడ్ వసతి గృహానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. దీంతో విద్యార్థులు అవస్థలకు గురవుతున్నారు. వసతి గృహం నుంచి లోగిస గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలకు సుమారు కిలోమీటరు దూరం వెళ్లాల్సి ఉంటుంది. అయితే రోడ్డంతా బురదమయంగా ఉండటంతో విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.



వసతి గృహానికి వెళ్లే మట్టి రోడ్డు ఇదే..

రెవెన్యూ సదస్సు పరిశీలన

శృంగవరపుకోట రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాంపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ అంబేద్కర్ హాజరయ్యారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టత్మకంగా నిర్వహిస్తున్న వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులను నుంచి సమస్యలను వినతిపత్రం రూపంలో స్వీకరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పాల్గొన్నారు. తహశీల్దార్ అరుణకుమారి పాల్గొన్నారు.

సీఏ ఫలితాల్లో వంగర విద్యార్థి ప్రతిభ

వంగర, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): వంగరకు చెందిన పొట్టా చంద్రశేఖర్ సీఏ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. గురువారం రాత్రి విడుదలైన ఫలితాల్లో మొదటి ప్రయత్నంలో 300 మార్కులకు గానూ 177 మార్కులు సాధించాడు. చంద్రశేఖర్ టెన్త్‌లో మండల టాపర్‌గా నిలిచాడు. ఇప్పుడు సీఏలో కూడా మొదటి ప్రయత్నంలో ప్రతిభ కనపరచటంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

అవగాహనతో క్షయవ్యాధి అంతం

రేగిడి, డిసెంబరు 27, (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ క్షయ వ్యాధిపై అవగాహన పెంపొందించుకోవాలని, చైతన్యంతో దీన్ని అంతం చేయవచ్చునని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ డాక్టర్ డేనీ, టీబీ నియంత్రణ స్టేట్ టెక్నికల్ అధికారి వెంకట నాయుడు అన్నారు. క్షయ రహిత సమాజం అందరి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. మండలంలోని బూరాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం లింగాలవలసలో టీబీపై అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు, సిబ్బంది ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ చలమయ్య, ఎంపీఈవో రాధాకృష్ణ, సూపర్‌వైజర్ సాయికృష్ణ, టీబీ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ వేణుగోపాలరావు, సీహెచ్‌వో శిరీష ఉన్నారు.

చినదేముడుకు ఎమ్మెల్యే పరామర్శ

కొత్తవలస, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురైన విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షుడు తిక్కాన చినదేముడును శుక్రవారం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పరామర్శించారు. మండలంలోని అప్పన్నపాలెంలో ఆయన నివాసానికి వెళ్లి బాగోగులు తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఆమెతో పాటు రాంప్రసాద్, కరెడ్ల ఈశ్వరరావు ఉన్నారు.

న్యాయవాదులు దరఖాస్తు చేసుకోవాలి

కొత్తవలస, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రాక్టీసు చేస్తున్న న్యాయవాదులందరూ తమ ప్రాక్టీస్ సర్టిఫికెట్‌ను ఈ నెల 31 లోగా రెన్యువల్ చేయించుకునేందుకు ఏపీ బార్ కౌన్సిల్‌కు దరఖాస్తులను పంపించాలని కొత్తవలస న్యాయవాద సంఘం అధ్యక్షురాలు డి.వి.ఎల్.దేవి తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆమె ప్రకటన విడుదల చేశారు. కొత్తవలస న్యాయవాద సంఘంలో 34 మంది న్యాయవాదులున్నారన్నారు. వీరు కోర్టులో ప్రాక్టీసు చేస్తున్నట్టు ధ్రువీకరించే వకాల్తా నామాలు, మెమో ఆఫ్ అపిరీయన్స్‌లు, సర్టిఫైడ్ కాపీలు, రెండు పాస్‌పోర్టు ఫొటోలు, రూ.500 చలానాతో బార్ కౌన్సిల్ జారీ చేసిన సర్టిఫికెట్, ఐదు సంవత్సరాలు కిందట జారీ చేసిన సీవోపీలను పొందుపర్చాల్సి ఉంటుందన్నారు. న్యాయవాదులు ప్రాక్టీసు చేస్తున్నట్టు న్యాయవాద సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ధ్రువీకరణ పత్రం తప్పనసరిగా ఉండాలని ఆమె తెలిపారు.

'శంఖరావం' విజయవంతం చేద్దాం

జామి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖరావం సభను అందరూ విజయ వంతం చేయాలని ఆర్ఎస్ ఎస్ రాష్ట్ర ప్రతినిధి నరస య్య కోరారు. శుక్రవారం మండలంలోని ఆర్.బి.పురం, అగ్రహారంలో జనసేన మం డల అధ్యక్షుడు పీవీఆర్ వర్మరాజు ఆధ్వర్యంలో గోడ పత్రికలు, కర పత్రాలు అవిష్కరించారు. కార్యక్రమంలో బిజేపీ మండల పార్టీ అధ్యక్షురాలు ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాల ఆవిష్కరణ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

క్రైం కార్నర్

- కృష్ణా జిల్లాలో ఘటన
- మృతుడు మెంటాడ మండలవాసి
- మరోముగ్గురికి తీవ్రగాయాలు



రాములు (ఫైల్)

మెంటాడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లాలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మెంటాడ మండలంలోని జక్కువ గ్రామానికి చెందిన కొంతెన రాములు (55) దుర్మరణం పాలయ్యారు. ఇదే గ్రామానికి చెందిన మరో ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. జక్కువ గ్రామానికి చెందిన సుమారు 10 కుటుంబాలు రెండేళ కిందట బతుకు తెరువు కోసం కృష్ణా జిల్లా జుజ్జువరం వెళ్లారు అక్కడే ఉపాధి పొందుతూ అప్పుడప్పుడు స్వగ్రామానికి వస్తుంటారు. శుక్రవారం ఉదయం కొంతెన రాములు, రెడ్డి సత్యం, రెడ్డి ఈశ్వరరావు, పప్పల సత్యం తాము ఉంటున్న ప్రాంతం నుంచి బహిర్భూమికి వెళ్తుండగా కూరగాయల లోడుతో వెళ్తున్న వాహనం వారిని ఢీకొంది. దాంతో రాములు అక్కడకక్కడే మృతిచెందగా.. మిగిలిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను మచిలీపట్టణం ఆసుపత్రికి తరలించారు. మృతుడు రాములుకు భార్య కళావతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రమాదం విషయం తెలియడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

అపార్ట్‌మెంట్ పైనుంచి పడి..

పరవాడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్ పైనుంచి కాలు జారి కింద పడడంతో కార్మికుడు మృతి చెందాడు. దేశపాత్రునిపాలెం శివారు శేషాద్రినగర్‌లో శుక్రవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి సీఐ జి.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శేషాద్రినగర్‌లో జీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఆధ్వర్యంలో అపార్టుమెంట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కూర్మన్నపాలేనికి చెందిన చోడి నాగరాజు(46) ఇక్కడ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం తొమ్మిదిన్నర గంటల సమయంలో నాలుగో అంతస్తు పరంజిపై నిలబడి పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ కాలు జారడంతో కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కార్మికులు కేజీహెచ్‌కు తరలించారు. నాగరాజును పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య అప్పలనర్సమ్మ, కుమారుడు ధనుంజయ్, కుమార్తె నందిత ఉన్నారు. ఇతని స్వస్థలం పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం కడకెల్లా గ్రామం. కొంతకాలం నుంచి కుటుంబంతోసహా కూర్మన్నపాలెంలో నివాసం ఉంటున్నాడు. శనివారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని, నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

బైక్ ఢీకొని..

దత్తిరాజేరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని షికారుగంజి రోడ్డు జంక్షన్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పశువులను తోలుకు వెళ్తున్న ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ద్విచక్ర వాహనం బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టానికి తరలించారు. మృతుడు ఒడిశా రాష్ట్రం లఫగూడ గ్రామానికి చెందిన కోరా దబులు (40)గా గుర్తించారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి కూడా తీవ్ర గాయాలయ్యాయి ఈ ఘటనపై బూర్జవలస ఎస్ఐ జి.రాజేష్ కేసు నమోదు చేశారు.

మోపాడ జంక్షన్ సమీపంలో..

డెంకాడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డెంకాడ మండలం మోపాడ జంక్షన్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొండరాజుపేట గ్రామానికి చెందిన సరగడ సన్యాసిరెడ్డి (59) మృతి చెందారని డెంకాడ ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. కొండరాజుపేట గ్రామానికి చెందిన సన్యాసిరెడ్డి టిఫిన్ కోసం రోడ్డు దాటుతున్న సమయంలో విశాఖపట్నం నుంచి విజయనగరం వెళుతున్న ద్విచక్ర వాహనం అతివేగంగా వచ్చి ఢీకొందన్నారు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే చెందారన్నారు.

బస్సు కింద పడి..

రాజాం రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజాం పట్టణంలో డోలపేట సమీపంలో శుక్రవారం రాత్రి బస్సులో నుంచి తొందర పడి గెంతేయడంతో ఓ యువకుడు బస్సు చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి రేగిడి మండలం బూరాడ గ్రామానికి చెందిన యువకుడు కొంగారపు రాజు (30) రాజాంలో పాలకొండ వెళ్లే బస్సు అనుకుని సంతకవిటి మండలం మందరాడ వెళుతున్న బస్సు ఎక్కిపోయాడు. బస్సులోనికి వెళ్లిన తరువాత ఈ బస్సు పాలకొండ వెళ్లదని కండక్టరు చెప్పడంతో రాజు గాబరాగా బస్సులో నుంచి గెంతేశాడు. దీనితో ఆ యువకుడు బస్సు చక్రాల కిందపడి మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రిన్సిపాల్‌పై పోక్సో కేసు

వీరఘట్టం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలం నడుకూరులోని ఓ ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్ తెర్లి సింహాచలం విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని తల్లిదం డ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపాల్‌పై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ జి.కళానిధి శుక్రవారం తెలిపారు.

సీఎస్‌డీటీకి తీవ్ర గాయాలు

భోగాపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భోగాపురం రెవెన్యూ కార్యాలయానికి చెందిన సీఎస్‌డీటీ బి.వి.మురళీ గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యాయి. మురళీ విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై పూసపాటిరేగ నుంచి విజయనగరం వెళ్తుండగా ముంగినాపల్లి సమీపంలో ఆయన పడిపోయారు. దాంతో తలకు బలమైన గాయాలయ్యాయి.

మద్యం సీసాల పట్టివేత

గజపతినగరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తబగ్గాంలో శుక్రవారం పోలీసులు చేపట్టిన దాడుల్లో ఎస్.సత్యనారాయణ 10 మద్యం సీసాలతో పట్టుబడ్డాడు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు దాడి చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ జనార్దనరావు తెలిపారు.

బైండోవర్ కేసులు నమోదు

బొండపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులపై శుక్రవారం తహశీల్దార్ డోల రాజేశ్వరరావు బైండోవర్ కేసులు నమోదు చేశారు. పాత కేసుల్లో మద్యం విక్రయిస్తూ పట్టుబడిన నలుగురిని తహశీల్దార్ ఎదుట గజపతినగరం ఎక్సైజ్ ఎస్ఐ పి.నరేంద్రకుమార్ హాజరుపరిచిన నేపథ్యంలో ఆయన బైండోవర్ కేసులు నమోదు చేశారు.

గరివిడికి చేరిన ప్రచారజాతా

గరివిడి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నుంచి బయలుదేరిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ ప్రచార జాతా ప్రతినిధులు శుక్రవారం గరివిడి చేరుకు న్నారు. వారిని స్థానిక యూ టీఎఫ్ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శులు రెడ్డి మో హనరావు, వి.లక్ష్మి మాట్లాడుతూ జనవరి 5న కాకినాడలో నిర్వహించనున్న స్వర్ణోత్సవ సభను అందరూ విజ యవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎ.సత్యశ్రీనివాస్, గొర్లె పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



గరివిడి చేరుకున్న నాయకులు

శృంగవరపుకోట: శృంగవరపుకోటలో శుక్రవారం యూటీఎఫ్ ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ బడిని రక్షించుకోవడమే ధ్యేయంగా కాకినాడలో జనవరి 5 నుంచి 8 వరకు జరగనున్న స్వర్ణోత్సవ మహాసభలను అందరూ జయప్రదం చేయాలని కోరారు. ర్యాలీలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు రెడ్డి మోహనరావు, వి. శ్రీలక్ష్మి, ఆడిట్ కమిటీ సభ్యులు జె.రమేష్‌చంద్ర పట్నాయక్, జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస రావు, నాయకులు డి.రాము, జి.వి.రమణ, నారాయణ, కొండలరావు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించండి

గజపతినగరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేదప్రజలపై పెంచిన విద్యుత్ భారాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య డిమాండ్ చేశారు. వైసీపీ అధిష్టానం పిలుపు మేరకు శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయం నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని చంద్రాబాబు మాయమాటలు చెప్పారని విమర్శించారు.

రాజాం/రూరల్: విద్యుత్ చార్జీల పెంపుదలకు నిరసనగా రాజాంలో శుక్రవారం వైసీపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి తలే రాజేశ్ విద్యుత్ శాఖ ఏడీఈకి వినతిపత్రం అందజేశారు. తక్షణమే విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

చీపురుపల్లి: పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం చీపురుపల్లి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాయకులతో కలిసి విద్యుత్ శాఖ ఏడీఈ రమణకు వినతిపత్రం అందజేశారు.

అభివృద్ధే లక్ష్యంగా!

(ఐదో పేజీ తరువాయి)

ఉచిత గ్యాస్ సిలిండర్లను అందించారు. వారిలో 1,16, 007 మంది ఖాతాల్లో సబ్సిడీ నగదు జమైంది. ఇందు కోసం ప్రభుత్వం సుమారు రూ.8.72కోట్లు చెల్లించింది.

మొబైల్ కంటైనర్ ఆసుపత్రి..

గిరిజనులకు స్థానికంగానే వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోనే తొలిసారిగా సాలూరు మండలం కరడవలసలో కంటైనర్ ఆసుపత్రిని ప్రారంభించింది. పార్వతీ పురం, సాలూరు, పాలకొండ నియోజకవర్గాల్లోనూ కంటైనర్ ఆసుపత్రుల ఏర్పాటుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఇదిలా ఉండగా గిరిశిఖర గ్రామాల ప్రజలు అత్యవసర వేళల్లో ఇబ్బందులు పడకుండా ఫీడర్ అంబులెన్స్‌లను సైతం పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చారు.

పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అన్న క్యాంటీన్లను వైసీపీ సర్కారు మూసివేసిన సంగతి తెలిసిందే. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని పునః ప్రారంభించి.. పేదల ఆకలి తీరుస్తోంది. రూ.5కే నాణ్యమైన రుచికరమైన భోజనం అందిస్తోంది. జిల్లా కేంద్రం పార్వతీపురంలో అన్న క్యాంటీన్ పునఃప్రారంభమవగా, సాలూరు, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లో త్వరలో ప్రారంభించనున్నారు. ఈ మేరకు చురుగ్గా పనులు జరుగుతున్నాయి.

రుణపడి ఉంటా..

కూటమి ప్రభుత్వం అందిస్తున్న రూ.4వేల పింఛన్‌తో సంతోషంగా జీవిస్తున్నాను. కనీస అవసరాలన్నీ తీరుతున్నాయి. పింఛన్ సొమ్ముతో ఈ ఏడాది సంక్రాంతి పండగను ఆనందంగా జరుపుకుంటా. కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటాను.

- కె.హైమవతి, పార్వతీపురం

సంతోషంగా ఉంది

దీపం-2 పథకం కింద కనెక్షన్ మంజూరు కావడం చాలా సంతోషంగా ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మూడు నెలలకొకసారి ఉచిత గ్యాస్ సిలిండర్లను అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయం.

- ఎం.రాజేశ్వరి, పాచిపెంట

డబ్బులు ఆదా..

కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్‌తో మా ఖర్చు సగానికి సగం తగ్గింది. గ్యాస్ డబ్బులను పొదుపు చేసుకుంటున్నాం. మాకు ఏడాదికి ఆరు సిలిండర్ల వరకు అవసరం. మూడు సిలిండర్లు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుండడం ఆనందంగా ఉంది.

- వి.సూరీడమ్మ, పాలకొండ

స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయండి

సీతానగరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడిని రక్షించుకోవడం, రాజ్యాంగ విలువలు కాపాడుకోవడం ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలు కాకినాడలో జనవరి 5, 6, 7, 8 తేదీలలో నిర్వహిస్తున్నారని, ఉపాధ్యాయులందరూ జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్ కుమార్, ఎస్.మురళీమోహన్‌రావులు పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు ప్రచార యాత్ర నిర్వహిస్తున్నారు. ఈ యాత్రలో భాగంగా సీతానగరంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్, ఎస్.మురళీమోహనరావులు శుక్రవారం ప్రచార యాత్రను ప్రారంభించారు. మండల ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలు

సాలూరు రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు, పోషకాహారం, సికిల్ సెల్ ఎనీమియా తదితర అంశాలపై గ్రామీణ ప్రాంతాల్లో కళాజాత బృందాల ద్వారా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని నీడ్ ఎండీ పి.వేణుగోపాలరావు తెలిపారు. ఆయన బొడ్డవలసలో శుక్రవారం నిర్వహిస్తున్న కళాజాతలో మాట్లాడారు. జిల్లాలో 50 పీవీటీజీ ఆదివాసీ గ్రామాల్లో ఈనెల 29 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సాలూరు మండలంలోని పలు గ్రామాల్లో బొంతలకోటి శంకరరావు బృందం కళాజాతా నిర్వహించింది.

శ్రమదానంతో రహదారికి మరమ్మతులు



శ్రమదానంతో రోడ్డును బాగు చేసుకుంటున్న దృశ్యం

భామిని, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు వెగ్రిగెడ్డపై ఉన్న వంతెన రక్షణ గోడ విరిగిపోవడంతో పాటు రోడ్డు పాక్షికంగా కుంగిపోయింది. దీంతో పాలవలస గ్రామానికి రాకపోకలకు సాగించేందుకు గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో శుక్రవారం ఆ గ్రామస్థులు ట్రాక్టర్‌తో గ్రావెల్ తెప్పించి కూరుకుపోయిన రక్షణ గోడ, రహదారి వద్ద మరమ్మతులు చేపట్టారు. ఇప్పటికైనా ఇంజినీరింగ్ అధికారులు స్పందించి ఇక్కడ సీసీ రోడ్డు నిర్మించాలని, రక్షణ గోడకు మరమ్మతులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయాధికారి రమేష్

మక్కువ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, సాలూరు జూనియర్ కోర్టు సివిల్ న్యాయాధికారి కె.రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు మహిళా సమాఖ్య భవనంలో మహిళా సంఘ సభ్యులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు లో ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను ఎవరైనా ప్రోత్సహిస్తే పోలీస్‌శాఖ దృష్టికి తీసుకెళ్తామన్నారు. గృహ హింస చట్టాలపై, మహి ళల లైంగిక వేధింపులపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు తాడ్డి తిరుపతి, సీనియర్ న్యాయవాది వీహెచ్‌కే శర్మ, తహసీల్దార్ షేక్ ఇబ్రహీం, ఎంపీడీవో స్వరూపారాణి, వెలుగు ఏపీఎం జయకుమార్ పాల్గొన్నారు.

గులిరాగి పంట పరిశీలన

సీతంపేట రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ కలువరాయి, బుడగరాయి, దంజుపాయి గ్రామాల్లోని గులిరాగి పంటను స్టేట్ ఎస్ఆర్‌పీ శుక్రవారం దేవుళ్ల పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. వరితో పోల్చుకుంటే రాగిలో దిగుబడులు ఎక్కువగా వస్తాయన్నారు. ఎన్ఎఫ్ఏ మునలయ్య, డివిజన్ ఎంటీలు బాలు, అంబోజీ, మండల ఇన్‌చార్జి సత్యనారాయణ, ఎస్‌సీఆర్‌పీ కామేష్, యూనిట్ ఇన్‌చార్జిలు నరేష్, కేశవ రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

జియ్యమ్మవలస, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం, క్రమశిక్షణ, చదువు విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఎంపీడీవో ఎస్.రమేష్‌తో కలిసి బీజే పురం ఉన్నత పాఠశాలను సందర్శించారు. హెచ్‌ఎం రఘురామరాజుతో మాట్లాడి, పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆరోగ్య స్క్రీనింగ్ టెస్టులను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి, వారి విద్యా ప్రమాణాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

తవ్వేశారు.. వదిలేశారు

● బాగువలస పశు వైద్య కేంద్రానికి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న పాడిరైతులు

● ఏళ్లు గడుస్తున్నా గొయ్యిని పూడ్చని వైనం



బాగువలస పశువైద్యకేంద్రం ముందు ఉన్న గొయ్యి

సాలూరు రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): బాగువలస పశు వైద్య కేంద్రం ముందు కొన్నేళ్లగా పెద్ద గొయ్యి దర్శనమిస్తోంది. రోడ్డు పనుల నిమిత్తం కొన్నేళ్ల కిందట ఆర్అండ్‌బీ శాఖవారు ఇక్కడ గొయ్యిని తవ్వి వదిలేశారు. చాలా ఏళ్ల గడుస్తున్నా ఆ గోతిని ఎవరూ పూడ్చలేదు. దీంతో పాడి రైతులు తమ పశువులను ఆ కేంద్రానికి తీసుకెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. పశు వైద్య కేంద్రానికి వెళ్లడం అలా ఉంచితే ప్రయాణికులకు కూడా ఈ ప్రాంతం ప్రమాదకరంగా మారింది. ఏమరుపాటున వాహన చోదకులు ఈ దారి గుండా వస్తే ప్రమాదానికి గురయ్యే అవకాశముంది.

బాధితులకు అండగా ఉంటాం

● ప్రభుత్వ విప్ జగదీశ్వరి

● ఏనుగుల తరలింపునకు చర్యలు



ఏనుగుల కారణంగా ధ్వంసమైన పంటను పరిశీలిస్తున్న విప్ జగదీశ్వరి

గరుగుబిల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల కారణంగా నష్టాలబారిన పడిన బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి భరోసా ఇచ్చారు. మండలంలోని నుంకి ప్రాంతంలో ఏనుగుల కారణంగా పాడైన పంటలను ఆమె శుక్రవారం పరిశీలించారు. అనంతరం బాధిత రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నుంకి పరిధిలో గత వారం రోజులుగా గజరాజుల గుంపు సంచరిస్తోందని, అధికంగా వరి, అరటితో పాటు పలు రకాల పంటలు ధ్వంసమయ్యాయన్నారు. పంట నష్టాలను నమోదు చేసి అంచనా వేయాలని అటవీ శాఖ అధికారులకు సూచించారు. సంబంధిత సమస్యలపై జిల్లా అటవీ అధికారికి ఫోన్‌లో అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. పరిహారం విషయంలో జాప్యం నెలకొనకుండా త్వరితగతిన అందించేలా కృషి చేయాలన్నారు. కురుపాం నియోజకవర్గంలో ఏనుగులు కారణంగా జరుగుతున్న నష్టాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలోని ఏనుగులు గుంపును తరలించేందుకు కర్ణాటక రాష్ట్రం నుంచి కుంకి ఏనుగులను తెప్పించే చర్యలు జరుగుతున్నాయన్నారు. అలాగే తుపాన్ కారణంగా నష్టం వాటిల్లిన పంటల వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తానని చెప్పారు. ఈ పరిశీలనలో టీడీపీ నాయకులు ఎ.మధుసూదనరావు, ఎం.పురుషోత్తంనాయుడు, ఎం.తవిటినాయుడు, అంబటి రాంబాబు తదితరులు ఉన్నారు.

నర్సరీ ధ్వంసం



ఏనుగులు ధ్వంసం చేసిన నర్సరీ

గరుగుబిల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకి గ్రామంలో ఉపాధి హామీ నిధులతో ఏర్పాటు చేసిన మొరింగి నర్సరీని ఏనుగులు ధ్వంసం చేశాయి. గత వారం రోజులుగా గ్రామంలో తిష్ట వేసిన ఏనుగుల గుంపు రహదారికి ఆనుకుని ఉన్న నర్సరీని ధ్వంసం చేశాయని ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ మరిశర్ల హరికృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ ఆదినారాయణ శుక్రవారం తెలిపారు. నర్సరీ సుమారు ఆరు వేల మొక్కలకు నష్టం వాటిల్లినట్టు చెప్పారు. వివరాలను ఉన్నతాదికారులకు నివేదించనున్నట్టు తెలిపారు. ఈ మొక్కలను లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉందన్నారు.

జంఝావతి ప్రాజెక్టును పూర్తి చేయాలి

పార్వతీపురం రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జంఝావతి ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఎం.మాలతి కృష్ణమూర్తినాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామంలో ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు వి.దాలినాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా ఉన్న ప్రాజెక్టు సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ఆ సంఘం ప్రతినిధులు జి.రఘు, సత్యసింహ చక్రవర్తి, సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలపై వైసీపీ ఆందోళనలు

బొబ్బిలి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపుపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైసీపీ పోరుబాట చేపట్టింది. మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం బొబ్బిలిలో నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్‌శాఖ ఈఈ ఆవాల అనంతరావుకు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ● కురుపాం: కురుపాంలో మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్ప శ్రీవాణి, వైసీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు ఆధ్వర్యంలో శుక్రవారం పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించా రు. విద్యుత్ శాఖ ఏడీఈ ఎం.రాజేంద్రప్రసాద్‌కు వినతిప త్రం అందజేశారు. ● పాలకొండ: విద్యుత్ చార్జీల పెంపును ఖండిస్తూ పాలకొండ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఏలాం జంక్షన్ నుంచి ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్ వరకు నినాదాలు చేసుకుంటూ ర్యాలీ చేసి ట్రాన్స్‌కో డీఈ కృష్ణమూర్తికి వినతిపత్రం అందించారు. ● సాలూరు: పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణం తగ్గించాలని మాజీ ఉపముఖ్యమంత్రి రాజన్నదొర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సాలూరులో ఆయన ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. సబ్‌స్టేషన్ వద్దకు చేరుకుని విద్యుత్ ఏడీ వి.రంగారావుకు వినతిపత్రం అందజేశారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం



మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సంతాపం తెలిపారు. శుక్రవారం పాలకొండలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఆయన కుటుంబానికి సానుభూతిని తెలిపారు.

ఘనంగా పీఎంపీల వార్షికోత్సవం

పార్వతీపురంటౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మానవ సేవే మాధవ సేవని మరిచిపోవద్దని ఇండియన్ మెడికల్ అసోషియేషన్ పట్టణ అధ్యక్షుడు డా.డి.రామ్మోహనరావు అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా పీఎంపీల వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సమ సమాజ స్థాపనలో పీఎంపీలు తమ వంతు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. అనంతరం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎస్.సింహాచలం, వి.శంకరరావుతో పాటు కార్యదర్శి ఎస్.గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

పార్వతీపురంటౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 29న జిల్లా స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహక అధ్యక్ష, కార్యదర్శులు భాస్కరరావు, చంద్రమోహన్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ఎంపికైన క్రీడాకారులంతా వచ్చే ఏడాది 1వ, 2వ, 3వ తేదీల్లో కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

ఏకగ్రీవంగా మండల బడ్జెట్ ఆమోదం

పాలకొండ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 2024-25కు సంబంధించి 2025-26 అంచనా బడ్జెట్‌ను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బొమ్మాళి భాను అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ముందుగా బడ్జెట్ అంశాలను ఎంపీడీవో రంగారావు సభ్యులకు వివరించారు. 2025-26 సంవత్సరం అంచనా బడ్జెట్‌లో రూ.9,97,493 రాబడి చూపిస్తూ రూ.2,52,228 ఖర్చును పొందుపరిచారు. అలాగే గత ఏడాదితో పాటు 2025-26 సంవత్సరానికి సంబంధించి ప్రారంభ బడ్జెట్ ముగింపు నిల్వలను అంచనా బడ్జెట్‌లో పొందుపరిచారు. గడిచిన ఏడాది రాబోయే సంవత్సరానికి సంబంధించి సాధారణ నిధులు, సమాజాభివృద్ధి, ప్రాథమిక విద్య, సాంఘిక సంక్షేమం, ఉపాధి హామీ పథకం, మహిళా సంక్షేమ పద్దుల కింద బడ్జెట్‌లో పొందుపరిచినట్టు ఎంపీడీవో తెలిపారు. ఈ బడ్జెట్ అంచనాలను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. అంతకుముందు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

నేడు బడిదేవరమ్మ కొండ పరిరక్షణ కమిటీ సమావేశం

పార్వతీపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కోరి గ్రామంలో శనివారం జరిగే బడిదేవరమ్మకొండ పరిరక్షణ కమిటీ సమావేశాన్ని విజయవంతం చేయాలని కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆటో ప్రచారం నిర్వహించారు. కొండ పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పాలక రంజిత్‌కుమార్, పోలా రమణి, కద్రక రామస్వామి, బొత్స నరసింగరావు, పెనుగుర్తి సంగం, సిరిపురం విశ్వేశ్వరరావు, నారాయణపురంరాజు, జన్ని ముత్యాలు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

గరుగుబిల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పనులు ప్రారంభమయ్యాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం పండ్ల తోటల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టారు. వ్యవసాయ పనులు ముగియడంతో ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకు చెందిన పొలాల్లో కందకాల పనులు నిర్వహిస్తున్నామని ఏపీవో ఎం.గౌరీనాథ్, క్షేత్ర సహాయకుడు నల్ల సూర్యనారాయణ తెలిపారు.

రావివలసను రెవెన్యూ గ్రామంగా విభజించాలి

గరుగుబిల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావివలసను ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా విభజించాలని ఎంపీటీసీ సభ్యుడు కోట భరత్‌కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం రావివలసలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ పి.బాలకు వినతిపత్రం అందించారు. లఖనాపురం రెవెన్యూగా ఉండటంతో పలు సమస్యలు ఎదురవుతున్నాయని వివరించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని చెప్పారు. సర్పంచ్ అప్పడు, మాజీ సర్పంచ్ మరిశర్ల బలరాంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

బెలగాం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీపీఐ వందవ ఆవిర్భావ దినోత్సవం సంద ర్భంగా శుక్రవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఆ పార్టీ నాయకులు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. సీపీఐ నాయకుడు ఆర్వీఎస్ కుమార్, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల్లో రైతులు

సాలూరు రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఎట్టకేలకు గురువారం వాతావరణం తెరిపించింది. దీంతో శుక్రవారం నుంచి రైతులు పొలం బాట పట్టారు. కోత పనులు ముమ్మరం చేశారు. తడిచిన వరి కుప్పలను ఎండ బెడుతున్నారు. బస్తాల్లో నిల్వ ఉంచిన ధాన్యాన్ని తేమ తగ్గించడానికి ఎండలో ఎండబెట్టారు. మొక్కజొన్నకు ఎరువులు, పురుగుల మందులు పిచికారీ చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

కిశోరి వికాసంపై శిక్షణ

సీతానగరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం కిశోరి వికాసంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పెదంకలాం పీహెచ్‌సీ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలకు సీడీపీవో సులేఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేకాధికారి కరుణాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. బాల బాలికలకు కిశోరి వికాసంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎన్ రాణి, ఎంపీడీవో పి.త్రివిక్రమరావు, ఎంఈవో సూరిదేముడు, సీతానగరం, బలిజిపేట సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. శనివారం సీతానగరం పీహెచ్‌సీ పరిధిలో శిక్షణ ఇస్తామని సీడీపీవో తెలిపారు.

15 గ్రామాల్లో పీసా ఎన్నికలు

సీతంపేట రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో 15 గ్రామాల్లో శుక్రవారం పీసా ఎన్నికలు నిర్వహించారు. ఈ గ్రామసభల్లో 13 ఏకగ్రీవం కాగా మిగిలిన వాటికి ఎన్నికలు జరిగాయి. ఈ పీసా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.

బీజేపీ మండల అధ్యక్షుడిగా అశోక్

గరుగుబిల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా పెద్దిరెడ్డి అశోక్ కుమార్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు శుక్రవారం ఆయనకు నియామక పత్రాన్ని అందించారు.

చెట్టు కొమ్మే ప్రమాద సూచిక

సాలూరు రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సాలూరు-మక్కువ రోడ్డులో బాగువలస జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో రోడ్డు మధ్యలో గొయ్యి ఏర్పడింది. ద్విచక్ర వాహనదారులు ఏమరపాటుగా ఉంటే ప్రమాదానికి గురయ్యే అవకాశముంది. దీంతో బాటసారులు.. ప్రమాద సూచకగా ఆ గోతిలో కొమ్మలు ఉంచారు.



గోతిలో కొమ్మను ఉంచిన దృశ్యం





